క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలని వినతి

నకిరేకల్ : నకిరేకల్ మండలంలోని పాలకవర్గం లేని ఎనిమిది గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించి కోతులు, కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ ఆండాళ్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో నాయకులు కందాల ప్రమీలా, రాచకొండ వెంకట్‌గౌడ్, వేంకటేశ్వర్లు, పుట్ట సత్తయ్య ఉన్నారు.

4 నుంచి మహిళలకు కోలాట పోటీలు

నల్లగొండ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకుడు దుబ్బాక నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు కోలాట, ముగ్గుల పోటీలను మార్చి 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మహిళ నాయకురాలు సరస్వతి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ పోటీలను స్థానిక ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. అంతేగాకుండా పోటీల్లో పాల్గొన్న మహిళలకు కానుకగా చీరను అందించనునట్లు తెలిపారు. ఈ సమావేశంలో భాగ్య, జూలకంటి హారిక, అక్తర్, జయమ్మ పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా యాదగిరి



నల్లగొండ టౌన్ : బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా వంటపాక యాదగిరిని నియమిస్తూ సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్ రాజ్యసభ సభ్యుడు రాంజీగౌతం, రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ మంద ప్రభాకర్ సూచనల మేరకు యాదగిని నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించినందున రాష్ట్ర, జిల్లానాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

దుర్గంధంతో వాకర్స్‌కు ఇబ్బందులు



మినీ స్టేడియంలో మురుగును పరిశీలిస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : స్థానిక మినీ స్టేడియంలోకి మురుగు కాల్వను మళ్లించడం ద్వారా వాకింగ్ చేసే వారు దుర్గంధ వాసనతో ఇబ్బందులు పడుతున్నారని టీపీసీసీ నేత దైద రవీందర్ తెలిపారు. సోమవారం మినీ స్టేడియంలో మురుగు వెళ్లే ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆ వాసనతో వాకర్స్ వాకింగ్ చేయలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందగట్ల వాసు, యూసఫ్, చెనగాని రాజశేఖర్‌గౌడ్, షేక్ లతీఫ్, వంటిపాక సతీష్ పందిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రిప్ అందించాలి

నల్లగొండ రూరల్ : రైతులకు సబ్సిడీపై డ్రిప్ స్ప్రింకర్, మినీట్రాక్టర్లు అందించాలని ముషంపల్లికి చెందిన రైతులు, బీజేపీ అనుబంధ మైనార్టీ నాయకులు సోమవారం గ్రీవెన్స్‌డేలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. మూడేళ్లుగా రైతులకు సబ్సిడీ డ్రిప్ అందించడం లేదని డ్రిప్ లేకపోవడంతో భూగర్భ జలాలు వృథా కావడంతో పాటు విద్యుత్ వినియోగం పెరుగుతుందని రైతులకు కూలీలకు భారం పెరిగిందన్నారు. జీఎస్టీ కూడా ప్రభుత్వమే భరించి డ్రిప్ వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మైనార్టీ జిల్లా కన్వీనర్ భాష, అజ్మీర్, జీవన్, రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

మర్రిగూడ : రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు నిరసనగా మండల కేంద్రంలో సోమవారం సీఐటీయూ, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్ అన్నారు. కార్మికులకు, కర్షకులకు వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తుందన్నారు. కేంద్రం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేద ప్రజలను, కార్మికులను ద్రోహం చేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర పునరాలోచించి బడ్జెట్‌లో పేద ప్రజలకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొట్టం యాదయ్య, ఉప్పునూతల వెంకటయ్య, నాయకులు మైల సత్తయ్య, పెరుమాండ్ల మంజుల, ఉరిపక్క వెంకటయ్య, నందిపాటి సుగుణ, జిల్లా అమృత, ఎండీ.నస్రీన్, జిల్లా లక్ష్మయ్య, వడ్లమూని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ నలుమూలలా అభివృద్ధి

- శరవేగంగా కొనసాగుతున్న పనులు
- వచ్చే నెలలో మంత్రి కేటీఆర్ మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ మందడి సైదిరెడ్డి, పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

నల్లగొండ టూటౌన్ : గతంలో ఎన్నడూ లేని విధంగా నల్లగొండ పట్టణం నలుమూలలా అభివృద్ధి పనులు నడుస్తున్నాయని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. పట్టణంలో చేపడుతున్న రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, వచ్చేనెలలో మంత్రి కేటీఆర్‌తో మరికొన్ని అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం చేయించనున్నట్లు తెలిపారు. సోమవారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గ సాధారణ సమావేశం చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ కుక్కల సమస్య కాలనీల్లో జఠిలంగా ఉందని, వాటిని నివారణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ రామగిరి ప్రధాన జాతీయ రహదారిపై దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మూడు నెలలుగా సమస్య ఉండడంతో దుకాణాదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రోడ్డు ప్యాచ్ వర్క్ త్వరగా పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ పెద్ద గడియారం సెంటర్ నుంచి ఎన్జీ కాలేజీ వరకు డ్రెయినేజీ తవ్వి పెట్టి నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ ఎందుకు పనులు ఆలస్యం చేస్తున్నాడని ప్రశ్నించారు. మాస్టర్ ప్లాన్‌లో వ్యవసాయ భూములను ఇండస్ట్రీయల్ జోన్‌గా, గ్రీన్ జోన్‌గా పెట్టారని, దీనిని మార్చాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ ఖయ్యూంబేగ్ మాట్లాడుతూ సరపడ తాగునీటి సౌకర్యం ఉన్నా కొన్ని కాలనీల్లో సమస్య వస్తుందని, రాక్ హిల్స్ కాలనీలో నీటిసమస్య పరిష్కరించాలని కోరారు. వేసవిలో త్రాగు నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సుందరయ్య కాలనీలో తాగు నీటి సమస్య ఉందని ఆ వార్డు కౌన్సిలర్ ఊట్కూరు వెంకటరెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొందరు శానిటేషన్ అధికారులు ఫోన్‌లు కూడా ఎత్తడంలేదని కౌన్సిలర్ బొడ్డుపల్లి లక్ష్మి శ్రీనివాస్ ఆరోపించారు. వాహనాల పరికరాలు సంబంధిత కాంట్రాక్టర్ ఇవ్వకపోవడంతో వాహణాలు వారాల తరబడి ఆగుతున్నాయని తెలిపారు. సభ్యులు లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ రమణాచారి సమాధానాలు చెప్పారు. ఎజెండా మోదిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. కాగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, అమూల్య కాలనీ పార్కు అభివృద్ధి చేయాలని, శ్మశానవాటికలో నీటి సమస్య పరిష్కరించాలని చైర్మన్, మున్సిపల్ కమిషనర్ కో ఆప్షన్ మెంబర్ కొండూరు సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, ఇతర అధికారులు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా విద్య, వైద్య సేవలు



ఫాదర్‌ను సన్మానిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : 25ఏళ్లుగా నిస్వార్థంగా అనేక మంది అనాథలు నిరుపేద చిన్నారులు, వృద్ధులు, మహిళలకు ఉచితంగా విద్యా, వైద్యసేవలు అందిస్తున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శాంతినగర్ సువార్త నిలయంలో నిర్వహించిన థామస్ తిప్పబత్తిని ఫాదర్‌గా 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సిల్వర్ జూబ్లీ కార్యక్రమానికి ఎమ్మెల్సీ గుత్తా హాజరై మాట్లాడారు. రెవరెండ్ ఫాదర్ థామస్ తిప్పబత్తిని సేవా నిరతి ఆదర్శనీయమని కొనియాడారు. అంతేగాకుండా గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సేవాకార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. ఫాదర్ సేవా దృక్పథంతో సుమారు 300మంది విద్యార్థులు జీవితంలో స్థిరపడ్డారన్నారు. తదనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 70మంది ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి సన్మానించారు. అదే విధంగా థామస్ ద్వారా సేవలు పొందిన అనేక మంది విద్యార్థులు, నిరుపేద ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు అజీత్, ఏ.జోసెఫ్, ఎమ్.థామస్, అమల్, శౌరయ్య, సిస్టర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లింగయ్య, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాన లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం మండలంలోని నక్కలపల్లి, పల్లెపహాడ్, అమ్మనబోలు గ్రామాల్లో కోటీ రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాతనే అన్ని గ్రామాల్లో అభివృద్ధి కనబడుతుందని, అభివృద్ధికి కోట్లాది రూపాయలను వెచ్చించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తున్నారన్నారు. ఎన్నడూ జరగని అభివృద్ధి కేసీఆర్ సీఎం అయిన తరువాతనే ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతిష్టాత్మకంగా కేసీఆర్ రైతుబంధు, దళిత బంధు పథకాలతో పాటు ప్రజలకు అవసరమయ్యే అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, లక్ష్మీమోహన్ రెడ్డి, కొంపెల్లి సైదులు, అంజయ్య, సర్పంచ్‌లు ఈద మాధవి నర్సింహ, బద్దం వరలక్ష్మి రామ్‌రెడ్డి, కల్వకుంట్ల రమేష్‌రెడ్డి, ఉపేందర్, శేఖర్‌రెడ్డి, మేడి పుష్పలత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్, రైతు సమితి మండల అధ్యక్షులు యానాల అశోక్‌రెడ్డి, జాన్‌రెడ్డి, సత్తయ్య, తదితరులున్నారు.

రైతులను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న వీరెల్లి చంద్రశేఖర్

నల్లగొండ టూటౌన్ : రుణమాఫీ పేరుతో రైతులను బీఆర్ఎస్‌ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర నాయకులు మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రబారి వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని హైదర్‌ఖాన్‌గూడ, శాంతినగర్ శక్తి కేంద్రం 87, 88, 89, 90 బూతుల్లో కార్నర్ మీటింగ్ సోమవారం శక్తి కేంద్ర ఇన్‌చార్జి వెన్నమల మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ రాజ్యాంగ వ్యతిరేక ప్రజా వ్యతిరేక మహిళా వ్యతిరేక రైతు వ్యతిరేక నిర్ణయాల వల్ల తెలంగాణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నూకల వెంకట్‌నారాయణ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతేపాక సాంబయ్య , సీనియర్ నాయకులు గుండగొని శీను, ఫకీర్ మోహన్ రెడ్డి, యూసుఫ , దేవేందర్ బూత్ అధ్యక్షులు బాణావత్తు బిల్లా నాయకు, అన్నెపురి శివ , తిరుమల పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ జాతీయ జట్టుకు ఎంపిక



శ్రీకాంత్

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన దోరేపల్లి శ్రీకాంత్ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల 8న వరంగల్ జిల్లాలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఫెడరేషన్ కప్ సెలెక్షన్‌లో శ్రీకాంత్ ఎంపికైనట్లు మంగళపల్లి జెడ్పీహెచ్ఎస్ పీఈటీ చింతకాలయ పులయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి ఒకటి నుంచి 4తేదీ వరకు హరియాణలో నిర్వహించే హ్యాండ్ బాల్ ఫెడరేషన్ కప్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. మంగళపల్లి విద్యార్థిని శ్రీకాంత్ జాతీయ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపిక కావడం వల్ల స్థానిక ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగధర్‌రావు, సర్పంచ్ ప్రగడపు నవీన్‌రావు, స్థానికులు అభినందించారు.

లక్ష్మమ్మకు నివాళి

చండూరు : పపట్టణంలోని ఏడో వార్డు లో చిలుకూరి లక్ష్మమ్మ (65) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె చిత్ర పటానికి రాష్ట్ర షీప్ అండ్ గోట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గంజి వెంకటేశం, సర్పంచ్ ముడిగే ఎర్రన్న యాదవ్, చొప్పరి అనురాధ, నాయకులు జక్కలి శ్రీనివాస్,ఆవుల శ్రీను, దొంతరగాని వెంకట్, కారింగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నుల అందజేత



మునుగోడు : గురుకుల పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీచేస్తున్న నాయకులు



చిట్యాల : విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చిట్యాల : మండలంలోని వనిపాకల గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ఆ పాఠశాల 2015–16 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ క్లాస్‌మేట్ పీక మధుకుమార్ స్మారకార్థం పరీక్ష ప్యాడ్‌లను, పెన్నులను, జామెట్రీ బాక్స్ లను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం దంతూరి సైదులు గౌడ్, ఉపాధ్యాయులు గంపల రవీందర్‌రెడ్డి, రాపోలు శ్రీనువాసులు, బొమ్మలపల్లి మల్లేష్, శోభారాణి, సరిత, మహాదేవి, ప్రభాకర్, పూర్వ విద్యార్థులు బర్రె మధు, మేడి వేణుకుమార్, మేడి రాకేష్, మామిడి శివ, పీక సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులతో పాటు ప్రవేట్ పాఠశాలల విద్యార్థులకు ఇండిపెండెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు పందుల రవితేజ, నాయకులు యసరాని సత్యనారయణ, పుల్కరం శివ, అధ్యక్షుడు రాపోలు నరేష్, అధ్యక్షుడు బోజ్జ చంద్రశేఖర్, అనిల్ కుమార్, సరికొండ బాలస్వామి, నవీన్, మహేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



గూడపూర్‌లో ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

మునుగోడు : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జానయ్య అన్నారు. సోమవారం మండలంలోని గూడపూర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో సమావేశమై ఎంపీడీఓ మాట్లాడారు. కూలి పనులకు వచ్చి వారికి రోజుకు రూ.230చొప్పులు చెల్లిస్తున్నారని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ కంచి జ్యోతి, ఉపాధిహామి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చండూరు : వేసవి కాలంలో ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని చండూరు ఎంపీడీఓ యాకూబ్ నాయక్ అన్నారు. ఆయన సోమవారం తాస్కానిగూడెంగ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చే కూలీలు గ్రామాల పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్ల దగ్గర దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మండలం వ్యాప్తంగా 1100వందల మంది కూలీలు మాత్రమే పనులకు వస్తున్నారని..వచ్చే వారం లోగా కూలీల సంఖ్య పెంచేలా ఉపాధి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



శిక్షణ ఇస్తున్న అధికారులు

కేతేపల్లి : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను వందశాతం స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దాలని కేతేపల్లి ఎంపీపీ పెరుమాళ్ల శంకర్ అన్నారు. సోమవారం కేతేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛభారత్ మిషన్ రెండో విడత మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేతేపల్లి సర్పంచ్ జటంగి ముత్తమ్మ, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాల్, ఎంఈఓ నాగయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, మిషన్ భగీరథ ఏఈ అశోక్, ఈజీఎస్ ఏపీఓ సురేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రీతి కుటుంబానికి రూ.5 కోట్లు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



మెడికల్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నల్లగొండ టౌన్ : ర్యాగింగ్ భూతానికి బలైన కాకతీయ మెడికల్ కళాశాల విద్యార్థి ప్రీతి కుటుంబానికి రూ.5 కోట్ల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేశ్, కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. ముున్ముందు ర్యాగింగ్‌కు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సైదానాయక్, సరిత, నందిని,మౌనిక, అంజలి, భాగ్యలక్ష్మి, కోటి, కల్పన, రాధిక ,శరత్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

నల్లగొండ టూటౌన్ : వైద్యవిద్యార్థిని ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్సార్ టీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పర్వతం వేణు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థిని మృతి తమను కల్చివేసిందని తెలిపారు. ప్రభుత్వం వ్యవహరించిన తీరే ఈ ఘటనకు కారణమని ఆరోపించారు.

సైఫ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలి

కాకతీయ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన సైఫ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక మెడికల్ కళాశలను బంద్ చేయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయేందర్, ప్రశాంత్, సాయి,కిరణ, చారి,జయంత్, హర్ష, ఉదయ్, సహాయం, రవితేజ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రీతికి నివాళి

ర్యాగింగ్ కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డ ప్రీతికి బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంగోతు ప్రవీణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి బిక్కునాయక్ సోమవారం ఒక ప్రకటనతో తమ సంతాపాన్ని తెలిపారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

వైద్య విద్యార్థి ప్రీతి తన సీనియర్ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకొని మృతి చెందడం చాలా బాధాకరమని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో నల్లగొండ భాస్కర్ టాకీస్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులకు కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి విద్యాసంస్థలో ర్యాగింగ్ నిరోదక కమిటీ వేయాలని, టోల్‌ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి, సభ్యురాలు మంజుల , నిశ్రత్‌ఖాన్, శ్రావణి, లక్ష్మి, మమత, పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో

నల్లగొండ : ఇటీవల మృతి చెందిన మెడికో విద్యార్థిని ప్రీతి, బీటెక్ చదువుతున్న విద్యార్థిని రక్షితలకు నివాళులర్పిస్తూ టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇలాంటి దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి ఎంపీ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పెద్ది సుక్కయ్య

కట్టంగూర్ : మండలకేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఊట్కూరి నాగేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మృతుడి కూతురికి రూ.1 లక్ష, దశదిన కర్మ ఖర్చుల నిమిత్తం రూ.25వేలు చొప్పున మొత్తం రూ.1.25 లక్షలను పంపగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్యగౌడ్ మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకుడు రెడ్డిపల్లి సాగర్, మేడి ఈదయ్య, చెరుకు యాదగిరి, మేడి వెంకన్న, మాతంగి యాదయ్య, కొంపెల్లి లక్ష్మయ్య, రెడ్డిపల్లి వీరస్వామి, యర్కల లక్ష్మీనారాయణ, ఊట్కూరి శ్రీను, కాపుగొంటి గోపి, శ్రీకాంత్, దేవేందర్, నరేష్, వెంకటేష్, మధు, సాయి, హరిబాబు, ఉపేందర్, శివ ఉన్నారు.

ఢిల్లీకి ఆర్టీఐప పరిరక్షణ సమితి బృందం

రామగిరి(నల్లగొండ) : మార్చి 1 వతేదీన ఢిల్లీలో నిర్వహించే సమాచారం హక్కు చట్టం పరిరక్షణ సమితి జాతీయ స్థాయి సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మరబోయిన కేశవులు ఆధ్వర్యంలో బృందంగా బయలుదేరి వెళ్లారు. సోమవారం నల్లగొండ నుండి హైదరాబాద్ వరకు ర్యాలీగా బయలుదేరారు. నల్లగొండ ఆర్డీఓ జయ చంద్రారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బండమీది అంజయ్య, అపెక్స్ కమిటీ సభ్యుడు రామలింగం, యాట మల్లయ్య, జిల్లా కన్వీనర్ కత్తి భాస్కర్‌రెడ్డి, చింతపల్లి సదాలక్ష్మీ, దుబ్బ కొండమ్మ, గాదె ప్రణయ్‌కుమార్, శ్రీనివాసరావు, ప్రభాకర్‌రెడ్డి, కట్ట శ్రీనివాస్, భోనగిరి సందీప్‌కుమార్, జ్యోతి పాల్గొన్నారు.



బయలుదేరి వెళ్తున్న సమితి సభ్యులు

కేసీఆర్ మీద కేసు పెట్టాలి



మాట్లాడుతున్న ప్రియదర్శిని

నకిరేకల్ : తమ నేత మీద పరువు నష్టం దావా వేయడం కాదు.. దళితులకు దళితబంధు ఇస్తానని మోసం చేస్తున్న సీఎం కేసీఆర్ మీద కేసు పెట్టాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఆదిమళ్ల గోవర్ధన్, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి ప్రియదర్శిని డిమాండ్ చేశారు. సోమవారం నకిరేకల్‌లోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని హామీ ఇచ్చిన ఉన్న భూమిని లాక్కున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు..ఆముగ్గురు ఎమ్మెల్యేల మధ్య రూ.3500 కోట్ల ఇసుక దందా జరుగుతున్న విషయం వాస్తవం కాదా అని ఎద్దేవా చేశారు. తమ నేత, తమ పార్టీపై విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

ఎన్ఆర్ఐల సేవలు అభినందనీయం



మనోహర్‌ను సన్మానిస్తున్న పాశం రాంరెడ్డి

రామగిరి(నల్లగొండ) : జన్మభూమిపై ఉన్న ప్రేమతో ఎన్ఆర్ఐలు సేవ చేయడం అభినందనీయమని తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. అమెరికాలో వైద్యుడిగా స్థిరపడిన తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన గజ్జల శేషయ్య కుమారుడు గజ్జల మనోహర్, స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి రూ. 20 లక్షలు, శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి రూ. 10 లక్షలు అందజేశారు. ఇటీవల అమెరికా నుంచి అతడు వచ్చిన సందర్భంగా జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి సోమవారం మనోహర్‌ను అతడి తల్లిదండ్రులు గజ్జల శేషయ్య, విజయలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్‌లు మోష, సత్యనారాయణ, స్థానికులు వినయ్, నలపరాజు శ్రీను, సైదులు, శ్రీనివాసరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

నకిరేకల్ : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో సోమవారం నిర్వహించిన లయన్స్ క్లబ్ రీజినల్ మీట్‌లో నకిరేకల్ సెంటినియల్ క్లబ్ అధ్యక్షుడు మారిడి చంద్రశేఖర్ ఉత్తమ అధ్యక్షుడిగా ఎంపికయ్యాడు. క్లబ్ ఆధ్వర్యంలో చేసిన సేవలకు ప్రథమ బహుమతి అవార్డు దక్కింది. ఆర్‌సీ దాచేపల్లి ప్రకాష్ చేతుల మీదుగా ఉత్తమ అధ్యక్షుడు, ఉత్తమ క్లబ్ అవార్డులను శేఖర్ అందుకున్నాడు. ఈ సందర్భంగా శేఖర్‌ను నకిరేకల్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు యానాల రజనీకాంత్‌రెడ్డి, కందాల రాజేందర్‌రెడ్డి, కందాల వెంకట్‌రెడ్డి, ఎన్న శ్రీనివాస్, ప్రేమ్ నాథ్‌రెడ్డి, రాంరెడ్డి అభినందించారు.



అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్



పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

సీబీఎస్‌సీ పదోతరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటల కే జిల్లా కేంద్రంలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం సెంటర్ల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కిక్కిరిసి పోయింది. పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్లను పరీక్ష సెంటర్ అధికారులు చూసి విద్యార్థులను లోనికి అనుమతించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ